కథ

# మనవాడేనా?

ఆకునూరి మురళీకృష్ణ

విరించిని గురించి కొడుకు గౌతమ్ అన్న మాటలు విని షాక్ తిన్నట్లుగా వుండిపోయాడు రాజారావు. గౌతమ్ అలా మాట్లాడడం జీర్ణించుకోలేనట్లుగా వుంది. అలాంటి మాటలు తను చాలా సార్లు విన్నాడు. కానీ గౌతమ్ లాంటి యువకుడి నోటి వెంట అదీ తన ప్రాణ స్నేహితుడిని గురించి వినడంతో దెబ్బతిన్నట్లుగా అనిపించింది. కొంచెం కోపం కూడా వచ్చింది.

"మనవాళ్ళేనా?" అన్న ప్రశ్న తను కూడా తనకి తెలియకుండానే బంధువుల దగ్గర, ఇంటిలోనూ, ఆఫీస్‌లో తను 'మనవాళ్ళు' అనుకునే కొలీగ్స్ దగ్గర చాలా సార్లు వేసి వుంటాడు. అలాగే తనూ వాళ్ళ దగ్గర నుంచి ఆ ప్రశ్నని లెక్కలేనన్ని సార్లు ఎదుర్కొని వుంటాడు.

అవతల నుంచి ఆ ప్రశ్నకి కాదు అన్న సమాధానం వస్తే ఎలాంటి నెగటివ్ ఫీలింగూ వుండదు. కానీ అవును అన్న సమాధానం వస్తే మాత్రం తనకి తెలియకుండానే ఏదో చిన్న ఆనందం మనసులో. ఆ కొత్త వ్యక్తి పట్ల ఇతరుల మీద కలుగని ఏదో తెలియని అభిమానం, దగ్గరతనం లాంటి భావాలు కలుగుతాయి. ఇదంతా ఎంత సహజంగా జరిగిపోతుందంటే అవసరమున్నా లేకపోయినా ప్రతి చిన్న విషయాన్నీ ఎంతో లోతుగా విశ్లేషించే తన పరిశీలనా శక్తికి కూడా అందనంత సహజంగా.

ఈ అలవాటు తనకి చిన్నతనం నుంచీ లేదు. కాలేజ్ చదువు అయిపోయి ఉద్యోగంలో స్థిరపడి పెళ్ళి చేసుకుని కెరీర్‌గ్రాఫ్‌లో ఒక్కో మెట్టూ పైకెక్కుతున్న కొద్దీ ఎప్పుడు పడిందో తనకి తెలియకుండానే తనలో నాటుకున్న ఆ బీజం క్రమక్రమంగా పెద్దదౌతూ తను కూడా గమనించలేనంత నిశ్శబ్దంగా ఒక మహావృక్షమై తనలో పాతుకుపోయింది. ఇప్పుడు గౌతమ్ మాటల వల్ల తనని తాను ఒక్కసారి విశ్లేషించుకుంటున్నప్పుడు కానీ తనలో కూడా వేళ్ళూనుకుపోయివున్న ఆ వృక్షాన్ని గమనించలేదు.

ఆలోచిస్తున్న కొద్దీ రాజారావుకి తనకి తానే ఒక అనాగరికుడిలా, స్పెసిమెన్‌లా కనిపిస్తున్నాడు. తానే కాదు తనకి తెలిసి తన చుట్టూ వున్న మనుషుల్లో నూటికి తొంభై తొమ్మిది మంది తనలాంటి స్పెసిమన్లే. అలాంటి స్పెసిమన్ల ప్రభావమే గౌతమ్ మీద పడి వాడు అలా మాట్లాడేలా చేసిందా? ఆ ఆలోచన రాగానే అతని వెన్నులోంచి చలి జ్వరం వచ్చినట్లు ఒణుకు మొదలైంది.

ఎటు పోతున్నాం మనం?

విరించి, తను చిన్నతనం నుంచి కాలేజ్ రోజుల దాకా కలిసి చదువుకున్నారు. రెండు శరీరాలు, ఒకే మనసు లాంటి ఆత్మీయ సంబంధం తమది అప్పట్లో. తను ఉద్యోగంలో చేరిన కొత్తలోనే విరించి పై చదువుల కని అమెరికా వెళ్ళాడు. చదువయ్యాక అక్కడే ఉద్యోగం రావడం, పెళ్ళయాక కూడా అక్కడే స్థిరపడిపోవడం జరిగాయి. పెళ్ళయిన కొత్తలో తరచుగా ఇండియా వచ్చినా క్రమక్రమంగా రావడం తగ్గిపోయింది. దాదాపుగా పదిహేనేళ్ళవుతోంది అతడిని చూసి, ఆ మధ్యలో ఒకటి రెండు సార్లు ఇండియా వచ్చినా సమయానికి తను ఊళ్ళో లేకపోవడం వగైరాల వల్ల కలుసుకోలేకపోయారు. చాలా కాలం రెగ్యులర్‌గా ఉత్తరాలు రాసుకునే వాళ్ళు. ఉత్తరాలకి రెక్కలొచ్చి మన జీవితాల్లోంచి ఎగిరిపోయాక కొంతకాలం గేప్ వచ్చినా కొత్తగా వచ్చిన ఈ-మెయిల్స్, సెల్ ఫోన్లు ఆ లోటుని త్వరగానే భర్తీ చేసి తమ స్నేహాన్ని నిలిపాయి.

ఇండియాలో తన ప్రోగ్రాం తెలియచేస్తూ విరించి ఇచ్చిన మెయిల్ చూసాక రాజారావు విరించి తన ఇంటికి వచ్చే రోజు అందుబాటులో వుండేలా ఆఫీస్‌కి సెలవు పెట్టేసాడు. చాలాకాలం తర్వాత కలుసుకున్న చిన్నప్పటి ప్రాణ స్నేహితుడిని ఆప్యాంగా కౌగిలించుకున్నాడు. భార్యా పిల్లల్ని పిలిచి పేరుపేరునా పరిచయం చేసాడు. కౌసల్యకి అంతకుముందే పరిచయం వుంది. పెద్దాడు సిద్ధార్ధని కూడా విరించి చిన్నతనంలో చూసాడు. చిన్నాడు కౌశిక్ పుట్టాక మాత్రం విరించి రాలేదు.

గౌతమ్‌తోనూ కౌశిక్‌తోనూ చాలాసేపు మాట్లాడాడు విరించి, స్నేహితుడి చిన్నప్పటి ఇష్టాలని గుర్తుపెట్టుకుని రాజారావు చెప్పిన ప్రకారం ప్రత్యేకంగా చేసిన వంటకాలతో కౌసల్య ఆప్యాయంగా వడ్డించిన భోజనం చేసాక రాజారావు గదిలో కూర్చుని చిన్ననాటి ముచ్చట్లలో పడ్డారు స్నేహితులిద్దరూ. సాయంత్రం నాలుగున్నరకి బలవంతంగా లేచి బయలుదేరాడు విరించి.

విరించికి వీడ్కోలు చెప్పి లోపలికి వచ్చిన వెంటనే హాల్లో కూర్చుని టీవీ చూస్తున్న గౌతమ్ అన్నాడు అప్రయత్నంగా "నాన్నా...ఆ అంకుల్‌ది ఫలానా కేస్ట్ కదా?" అని!

రాజారావుకి ఒక్క క్షణం తనేం విన్నాడో అర్థం కాలేదు. "ఏమిటి నువ్వు మాట్లాడుతున్నది?" అన్నాడు కొడుకుని తీక్షణంగా చూస్తూ. రాజారావు చూపుల్లోని తీక్షణతని గమనించలేదు గౌతమ్.

"అవును నాన్నా..నేను గన్ షాట్ గా చెప్పగలను. ఆయన మాట్లాడిన విధానం. ప్రవర్తనని బట్టి ఇట్టే చెప్పచ్చు" అన్నాడు ఏదో గొప్ప విషయాన్ని కనిపెట్టినట్లు గర్వంగా.

రాజారావుకి తలతిరిగినట్లయింది గౌతమ్ మాటలకి. విరించి గొప్ప మేధావి. ఆత్రేయపురం దుంపలబడిలో చదివి అమెరికన్ యూనివర్సిటీలో ప్రొఫెసర్ అయిన తన మేధస్సుతో అందరినీ అబ్బుర పరుస్తున్నాడు. వాడితో కొద్దిసేపు మాట్లాడితే ఎవరికైనా ఇట్టే అర్థమౌతుంది వాడెంతటి మేధావో. అలాంటిది వాడితో అరగంటసేపు పిచ్చాపాటిగా మాట్లాడిన ఇంజనీరింగ్ ఫైనలియర్ చదువుతున్న గౌతమ్‌కి వాడి మాటల్లోనూ ప్రవర్తనలోనూ 'కులం వాసన' తప్ప ఇంకేం కనపడలేదంటే ఎంత సిగ్గుచేటు?

ఆ మాటే అన్నాడు వాడితో కోపంగా "అంకుల్‌తో మాట్లాడిన అంతసేపటిలోనూ ఇంతకన్నా ఇంకేం గ్రహించలేకపోయిన నువ్వొక ఫూల్‌వని నీకనిపించడం లేదా?"

రాజారావు ముఖంలోని సీరియస్‌నెస్ గమనించిన గౌతమ్‌కి అప్పటికిగానీ అర్థం కాలేదు తనెంత అర్థరహితమైన కామెంట్ చేసాడో. "సారీ నాన్నా..ఏదో అలవాటులో అనేసాను" అన్నాడు గౌతమ్ తలదించుకుని.

ఈసారి అతడి మాటలకి మరింత షాక్ తిన్నాడు రాజారావు...అలవాటు? కాలేజ్‌లో చదివే కుర్రాడికి ఇదేం అలవాటు? ఎదుటి వ్యక్తిని చూడగానే, అతను నోరు విప్పి రెండు మాటలు మాట్లాడగానే అతని ముఖం చూసి అతను ఫలానా కేస్ట్ అని కనిపెట్టెయ్యడం? ఇంజనీరింగ్‌లో అదో సబ్జెక్టా వాళ్ళకి?

వస్తున్న కోపాన్ని కంట్రోల్ చేసుకుంటూ ప్రసన్నంగా మారి గౌతమ్ ఎదురుగా కూర్చుంటూ "అదేం అలవాటు?" అన్నాడు చిన్నగా నవ్వుతూ. అడాలసెంట్ యువకులతో ఎలా మాట్లాడాలో అతనికి అనుభవపూర్వకంగా తెలుసు.

అతనలా ప్రసన్నంగా అడగడంతో గౌతమ్ కూడా నవ్వుతూ చెప్పడం మొదలుపెట్టాడు. "మా కాలేజ్‌లో ప్రొఫెసర్లలో చాలామంది ఒక కేస్ట్‌కి చెందిన వారు. ఆ విషయం మాకు ఫస్ట్ సెమిస్టర్ ఫలితాలు వచ్చాక ఇంట

ర్నల్ ఎగ్జామ్స్‌లో వచ్చిన మార్కుల వల్ల క్రమంగా తెలిసింది. ఇంటర్నల్స్‌లోనూ ప్రాక్టికల్ పరీక్షలలోనూ మాలో వున్న వాళ్ళ కేస్ట్‌కి చెందిన విద్యార్థులకి మాకు తెలియకుండానే ఎక్కువ మార్కులు వేసేవారు!

ఆ విషయం తర్వాత మాకు మా సీనియర్లు కూడా ధృవీకరించారు. వాళ్ళకున్న ఆ ఫీలింగ్ వల్ల మిగిలిన వాళ్ళకి హాని ఏమీ వుండదు కానీ వాళ్ళ కులం వాళ్ళకి మాత్రం కొంత ఫేవర్ జరుగుతుంది. అదే రకంగా మిగిలిన ప్రొఫెసర్లు కూడా వాళ్ళ వాళ్ళ కులాలకి సంబంధించిన వాళ్ళమీద ప్రత్యేకమైన అభిమానం చూపిస్తారు. వాళ్ళు చూపించినా చూపించకపోయినా అలా అనుకుంటాం మేము. ఆ రకంగా మాకు కాలేజ్‌కి ఎవరైనా కొత్త లెక్చరర్‌లు కొత్త స్టూడెంట్‌లు వస్తే వాళ్ళ ముఖం చూసి వాళ్లు ఏ కులానికి చెందినవారో వాళ్ళకి ఎవరివల్ల మంచి జరగబోతోందో ముందే ఊహించేయడం మాకు అలవాటైపోయింది. ఆ అలవాటుతోనే అంకుల్ని చూడగానే ఆయన కేస్ట్ ఏమిటో ఊహించేయగలిగాను.

మాలో మాకు ఎవరైనా ఒకటే...అందరూ స్నేహితులమే కనుక దీనివల్ల ఎదుటివారికి జరిగే ఫేవర్‌కి మాకేం నష్టం లేదు కనుక మేమెవరం అసూయచెందం. పైగా మాలో ఎవరైనా ఇబ్బందుల్లో వుంటే ఫలానా ప్రొఫెసర్ దగ్గరకి వెళ్ళు. మీవాడే...నీకు హెల్ప్ చేస్తాడు అని కూడా చెప్పుకుంటూ వుంటాం."

వింటున్న రాజారావు తన చెవుల్ని తానే నమ్మలేకపోయాడు. విద్యాసంస్థలు కూడా ఇలా వుంటాయా అని ఆశ్చర్యపోయాడు. అతనికి తన ఆఫీసు గుర్తుకు వచ్చింది. తన ఆఫీస్‌లో పని చేసే ఎగ్జిక్యూటివ్ ఏ కులానికి చెందినవాడైతే అతని హయాంలో ముఖ్యమైన సీట్లలో అందరూ అదే కులానికి చెందిన వాళ్ళు వుండేలా చూసుకోవడం గుర్తుకు వచ్చింది. చాలా సహజంగా జరిగిపోతుంది అదంతా. దారుణమైన విషయమేమిటంటే మిగిలిన వాళ్ళు కూడా దాన్ని సహజంగానే తీసుకోవడం! కాలేజీల్లో పనిచేసేవాళ్ళూ తమలాంటి మనుషులే కదా?


గౌతమ్ మాత్రం రాజారావు ఆలోచనల నేమాత్రం గమనించకుండా కాలేజ్ సంగతులు కనుక హుషారుగా చెప్పుకుపోతున్నాడు.

"అలా ఫేవర్ చేయడం కేంపస్ రిక్రూట్‌మెంట్‌లో మరీ ఎక్కువగా వుంటుంది. ఎవరైనా లెక్చరర్ కొంతమంది స్టూడెంట్స్‌ని రికమెండ్ చేసాడంటే అందులో కచ్చితంగా ఎక్కువమంది ఆయన కులానికి చెందినవాళ్ళే అయి వుంటారు. కులం పేరుతో నడిచే ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీ క్యాంపస్ రిక్రూట్మెంట్‌కి వస్తే ఆ కులానికి సంబంధించిన వాళ్ళకి తొంభై శాతం ఉద్యోగం గ్యారంటీ..." అంటూ ఆగి ఏదో గుర్తుకు వచ్చినవాడిలా నవ్వి అన్నాడు. "అలా ఎదుటి మనిషి కేస్ట్‌ని అసెస్ చేయడం వల్ల మాకు మరో లాభం కూడా వుంది..."

"ఏమిటది?"

గౌతమ్ మరింతగా నవ్వి సిగ్గుపడుతూ చెప్పాడు తండ్రి దగ్గర వున్న చనువుతో.

"మాలో



ఎవరమైనా ఏ అమ్మాయినైనా ఇష్టపడే ముందు వాళ్ళ కేస్ట్ అసెస్ చేసుకుని మరీ ప్రొసీడౌతాం ఆ తర్వాత మళ్ళీ పేరెంట్స్‌తో గొడవలేకుండా!"

హతాశుడైనట్లుగా చూసాడు రాజారావు అతడి మాటలకి. వ్యవస్థలోని సంక్లిష్టతని ఎదుర్కొని పోరాడి సరళతరం చేసే బదులు నేటి యువతరం దానికి అనుగుణంగా తమని తామే మార్చేసుకుని సులువుగా జీవించేస్తున్నారు. ఎంత దారుణమైన విషయం? దీనివల్ల వాళ్ళు కోల్పోతున్నదేమిటో వాళ్ళకెలా తెలుస్తుంది?

అతడికి తన స్కూలు రోజులు గుర్తుకు వచ్చాయి. తమ క్లాసులో కొంతమంది హరిజనులు చదువుకునే వారు. ఊళ్ళో వాళ్ళకిచ్చే ట్రీట్‌మెంట్ సెకండరీగా వుండేది. అప్పట్లో వాళ్ళతో కలిసి తిరగడం, వాళ్ళని తమ ఇళ్ళకి తీసుకువెళ్ళడం, వాళ్ళు నివసించే పేటకి వెళ్ళడం చిన్నతనంగా భావించేవారు మిగతావారు. క్లాసు పుస్తకాల వెనుక అట్టల వెనుక ముద్రించే అంటరానితనం నేరం. అస్పృశ్యత పాపం అన్న మహాత్మాగాంధీ సూక్తులని చూసి ప్రేరణ పొందిన తను ఒకసారి తమ క్లాసులో చదువుతున్న సింహాచలం అనే హరిజన బాలుడ్ని తమ ఇంటికి తీసుకెళ్ళాడు. అది మొదలు తన ఇంటికి చదువుకోవడానికి రావడం అతడికి అలవాటుగా మారింది. తల్లి మొదట్లో తిట్టినా రాను రాను అలవాటుపడిపోయింది. తమ స్నేహం అప్పట్లో ఊళ్ళో సంచలనం సృష్టించింది. అందరూ తమ గురించి వింతగా చెప్పుకునే వారు. అయినా ఆ మాటలని తనేం పట్టించుకోలేదు. తను చేస్తున్న పనికి తండ్రి తన వంక మెచ్చుకోలుగా చూసిన చూపులు మాత్రం తనకింకా గుర్తే. ఆరోజు తను వేసిన ఆ ముందడుగు తనకెంతో సంతృప్తినిచ్చింది. రాను రాను క్రమంగా అందరిలోనూ మార్పు వచ్చింది.

రాజారావు ఆ విషయాలన్నీ గౌతమ్‌కి చెప్పాడు.

"అప్పట్లోనే మేము అలా రివల్యూషనరీగా ఆలోచించే వాళ్ళం. ప్రపంచం ఇంత ఫార్వర్డ్ అయ్యాక కూడా మీరు ఇలా ఆలోచించడానికి సిగ్గుగా లేదూ?" అన్నాడు.


"నువ్వు చెప్పినదానికి దీనికీ సంబంధం లేదు నాన్నా. ఇదేం అన్‌టచబిలిటీ కాదు" అన్నాడు గౌతమ్.

నిజమే...ఇప్పుడైతే అలాంటి ఫీలింగ్సే లేవు. హరిజనులు కూడా సమాజంలో గౌరవంగా తలెత్తుకు తిరగ్గలుగుతున్నారు. ప్రభుత్వం ప్రచారం వల్లనైతేనేమి, తనలాంటి వాళ్ళ చొరవ వల్లనైతేనేమి అంటరానితనం అన్నది దాదాపు పూర్తిగా సమాజంలోంచి తొలగించబడింది. కొన్ని కులాలవారిని తక్కువగా చూడడం పోయింది. కానీ అంతకన్నా భయంకరమైన ఈ కేస్ట్ ఫీలింగ్ అన్న జబ్బు మనకి తెలియకుండానే మనలో చోటుచేసుకుంది. ఇప్పుడు పైకి చెప్పకపోయినా ప్రతీవాళ్ళకీ తమవాళ్ళు తప్ప మిగిలినవాళ్ళంతా అంటరాని వాళ్ళే.

తండ్రి ముఖంలో కదలాడుతున్న భావాలని గమనిస్తూ అన్నాడు గౌతమ్. "నువ్వంత వింతగా చూస్తున్నావు కానీ ఇదేం అంత అసహజమైన విషయం కాదు నాన్నా. అంతెందుకు? నువ్వు నీ చిన్నప్పటి స్నేహితులని మినహాయించి పెద్దయ్యాక ఏర్పడ్డ నీ స్నేహితుల పేర్లు నాలుగు చెప్పు...కచ్చితంగా వాళ్ళలో ముగ్గురు మన కులానికి చెందిన వాళ్ళే అయివుంటారు"

రాజారావు ముఖం నల్లగా మాడిపోయిందా మాటలకి. అతడన్నది నూటికి నూరుపాళ్ళూ నిజం! తనే కాదు తనకి తెలిసి రెగ్యులర్‌గా కలుసుకునే స్నేహబృందాలని ఎవరిని గమనించినా వాళ్ళంతా చాలామటుకు ఒకే కులానికి చెందినవాళ్ళే అయివుంటారు. తమ కాలనీలో ఎవరికైనా ఆపద వస్తే ముందు స్పందించి ఆదుకునేది తప్పకుండా వారి తోటి కులస్తుడే. గమనిస్తే ఇవన్నీ ఎంతో విచిత్రంగా వుంటాయి. ఆ రకంగా 'సెక్యూరిటీ సర్కిల్స్' ఏర్పాటు చేసుకుంటున్నారా తామందరూ?

"దీనివల్ల కొంతమందికి మేలు జరుగుతుంది. మిగిలిన వారికి పెద్దగా నష్టం లేనప్పుడు అంతగా బెంగపడిపోవాల్సిన అవసరం లేదంటాను" ముందే చెప్పిన తమ యువతరం ఫాలో అయ్యే ఈజీగోయింగ్ ప్రిన్సిపల్ మళ్ళీ చెప్పాడు గౌతమ్ తండ్రి ముఖంలో బాధని గమనించి.



రాజారావుకి నవ్వొచ్చింది. నష్టమేమీ లేదా?

స్వతంత్రం వచ్చిన అరవై సంవత్సరాలకి కూడా కులరహిత సమాజాన్ని సాధించలేకపోవడం...తమ కులం హోదాని నిలుపుకోవడం కోసం దేశంలో తరచూ ఏదో ఒక వర్గం వారు జరిపే ఆందోళనలు...కులం పేరుతో బహిరంగ సభలు..రాజకీయ పార్టీలు...

అన్నింటినీ మించి 'ఇదింతే' అని మనలో పేరుకుపోతున్న నిర్లిప్తత...దాని వల్ల నష్టమేముందో...ఆలోచించేంత వయసూ, మెచ్యూరిటీ గౌతమ్‌కి లేకపోవచ్చు. కానీ అన్నీ వున్న తనలాంటి వాళ్ళు చేస్తున్నదేమిటి?

పాలబుగ్గల మీద నూనూగు వెంట్రుకలు మొలుస్తూ అప్పుడే యవ్వనంలోకి అడుగు పెడుతూ ఆరిందాలా అప్పటిదాకా తనతో మాట్లాడిన గౌతమ్‌ని చూస్తే మొట్టమొదటిసారిగా జాలివేసింది రాజారావుకి. గౌతమ్ ఒక్కడి మీదే కాదు...గౌతమ్‌లాంటి కొన్ని కోట్లమంది రేపటి భావిభారత పౌరులందరి మీదా...

* * *

ఆరోజు ఆఫీసులో ప్రమోషన్లకి ఇంటర్వ్యూలున్నాయి. రాజారావు బోర్డు ఛైర్మన్. తమవాళ్ళకోసం 'తమవాళ్ళ' దగ్గర నుంచి వచ్చిన రికమెండేషన్లని చిరునవ్వుతో విన్నాడు. తను చేయబోయే పనిని తల్చుకుంటే అతనికి మనసులోనే ఎంతో సంతోషంగా వుంది. చాలా కాలం తర్వాత మొట్టమొదటిసారిగా 'మనవాడేనా?' అన్న ప్రశ్న మనసులోకి కూడా రానీయకుండా నిర్ణయం తీసుకోబోతున్నాడు.

అభద్రతా భావంతో ఇన్నాళ్ళూ తాము ఏర్పాటుచేసుకున్న 'సెక్యూరిటీ సర్కిల్స్'ని ఛేదించి నిజమైన సెక్యూరిటీ సర్కిల్‌ని సాధించబోతున్నాడు.

చిన్నప్పుడు సింహాచలంతో స్నేహం చేసినప్పుడు కన్నా ఇప్పుడు ఇంకా ఎక్కువ గర్వంగా వుంది. అప్పుడు తనని సపోర్ట్ చేయడానికి తన తండ్రి, స్కూలు మాస్టారు లాంటి వారైనా వున్నారు. ఇప్పుడు తను చేయబోయే పనికి అందరి దగ్గర నుంచీ వ్యతిరేకతనే ఎదుర్కోవలసి వస్తుంది. అయినా తప్పదు. గౌతమ్‌లాంటి వాళ్ళ ఆలోచనలని మార్చే శక్తి తనకి రావాలంటే ముందు తనని తాను మార్చుకోవాలి.

## యాడ్స్‌లో భార్యాభర్తలు!

భార్యాభర్తలైన బాలీవుడ్ తారలు అజయ్ దేవ్‌గన్-కాజోల్ కలిసి యాడ్ ఫిలిమ్స్‌లో నటించడం చూశాం కదా! ఇప్పుడు మహేష్-నమ్రత కలిసి యాడ్స్‌లో కనిపించబోతున్నారు. 'విర్ల్‌పూల్' వ్యాపార ప్రకటనల్లో నటించడానికి ఈ సినీదంపతులు అంగీకరించినట్టు వినికిడి. గతంలో ఇద్దరూ 'వంశీ' అనే సినిమాలో జంటగా నటించాక తిరిగి కలిసి మరో సినిమా చేయలేదు. ఇప్పుడిలా యాడ్స్‌లో నటిస్తారన్నమాట. వెరీగుడ్!